సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

మంగళవారం । 25 । ఏప్రిల్ । 2023



రుణగొణ ధ్వనులకు మంగళం


పొదుపు సంఘాల లెక్కలు ఇకపై పక్కాగా ఉండనున్నాయి. పొందే రుణాలు, వారు చెల్లిస్తున్న వడ్డీ, పొదుపు వివరాల్లో పూర్తి పారదర్శకత చోటు చేసుకోనుంది. - 8లో▸



ఘనంగా వైదిక కార్యక్రమాలు

సత్యదేవుని కల్యాణ మహోత్సవాలలో స్వామి, అమ్మవార్లకు నిర్వహించే వైదిక పరమైన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని ఈఓ అజాద్ ఆదేశించారు. - 8లో▸

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం డెల్టా కాలువలకు 3,250 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 800, మధ్య డెల్టాకు 650, పశ్చిమ డెల్టాకు 1,800 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

అరుణాచలం యాత్రకు బస్సు సర్వీసులు



అమలాపురం రూరల్: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అమలాపురం డిపో నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణ యాత్రకు బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఈ యాత్రలో కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, కంచి, శ్రీకాళహస్తి, విజయవాడ ప్రాంతాలలోని దేవాలయాల దర్శనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మే మూడో తేదీన అమలాపురం డిపో నుంచి బస్సు బయలుదేరి క్షేత్రాలు దర్శించటంతోపాటు ఐదో తేదీ శుక్రవారం పౌర్ణమి సందర్భంగా అరుణాచల గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత ఏడవ తేదీ ఆదివారం తిరిగి అమలాపురం వస్తుందన్నారు. పుష్ బ్యాక్ 2 ప్లస్ 2 సిట్టింగ్ కలిగిన సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేశామన్నారు. పెద్దలకు సూపర్ లగ్జరీ బస్సుకు టికెట్ ధర రూ.2,950, పిల్లలకు రూ.2200, ఇంద్రా ఏసీ బస్సుకు పెద్దలకు రూ.4,000, పిల్లలకు రూ.3,000 గా నిర్ణయించామన్నారు. వివరాలకు 7013868687, 9959225576, 9959225550 నంబర్లలో సంప్రదించవచ్చునని తెలియజేశారు.

ఉత్తమ పంచాయతీలకు అవార్డులు



కలెక్టర్ హిమాన్షు శుక్లా నుంచి అవార్డు అందుకుంటున్న సర్పంచ్ శ్రీదేవి, కార్యదర్శి రాజమోహన్

అల్లవరం: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో తొమ్మిది విభాగాల్లో ఒక్కొక్క పంచాయతీకి మూడు విభాగాల్లో ఉత్తమ సేవలు అందించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పంచాయతీలకు సోమవారం అవార్డులు ప్రదానం చేశారు. పేదరికం లేని మెరుగైన జీవనోపాధుల గ్రామ పంచాయతీగా జిల్లా అవార్డును గోడితిప్ప సర్పంచ్ చిట్నీడి శ్రీదేవి, కార్యదర్శి రాజమోహన్‌లకు కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా అందించారు. కొమరగిరిపట్నం గ్రామ సచివాలయంలో సోమవారం ఎంపీడీఓ జి.సరోవర్ అధ్యక్షతన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. మహాత్మా గాంధీ చిత్రపటానికి ఎంపీపీ ఇళ్ల శేషరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తొమ్మిది విభాగాల్లో మెరుగైన సేవలు అందించిన పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఎంపీపీ శేషారావు చేతుల మీదుగా ఉత్తమ పంచాయతీలకు అవార్డులను ప్రదానం చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, సర్పంచ్‌లు సాధనాల వెంకటరావు, రాకాపు విజయలక్ష్మి, మల్లాడి మంగాయమ్మ, కొల్లు వెంకటరమణ, దాకారపు చిరంజీవిరావు, రొక్కాల విజయలక్ష్మి అధికారులు పాల్గొన్నారు.

రోగుల పాలిట యాప్‌ద్బాంధవి

- ‘ఈ–సంజీవని టెలి మెడిసిన్’తో మారుమూలలకూ మెరుగైన వైద్యం
- ఉమ్మడి జిల్లాలో 30.17 లక్షల మందికి ఇప్పటి వరకు మేలు
- వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ఆధ్వర్యంలో రోజుకు 15 నుంచి 20 మందికి సాయం
- విశాఖ రీజనల్ హబ్ పరిధిలో 21 మంది నిపుణుల సలహాలు

సాక్షి అమలాపురం: కాట్రేనికోన మండలం చిర్రయానాం నుంచి మండల కేంద్రమైన కాట్రేనికోనకు 16 కిలోమీటర్ల దూరం. స్థానికంగా ఆర్ఎంపీ, పీఎంసీల ద్వారా అందే సేవలు కూడా అంతంత మాత్రమే. వైద్యసేవలు పొందాలంటే మండల కేంద్రానికి ఆటోలపై, లేదా వ్యక్తిగత వాహనాలపై వెళ్లాల్సిందే. మెరుగైన వైద్యం కావాలంటే 29 కిలోమీటర్ల దూరంలో ఉన్న అమలాపురం వెళ్లాలి. ఆపై వైద్యసేవలకు రాజమహేంద్రవరం, కాకినాడ, విశాఖపట్నం వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. కాని ఇప్పుడు వారికి అందుబాటులోనే మెరుగైన వైద్యం అందుతోంది. ఇంటి వద్దకు ఫ్యామిలీ డాక్టర్ వస్తుండగా, నిపుణులైన వైద్యుల సలహాలు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ‘ఈ– సంజీవని టెలి మెడిసిన్’ ద్వారా అందుతున్నాయి. ఈ సేవలు పొందడానికి ఈ – సంజీవని యాప్‌ను డౌన్‌లోడు చేసుకోవలసి ఉంటుంది.

వ్యయ ప్రయాసలు లేకుండా..

కాట్రేనికోన మండలం చిర్రయానాంలో ఒక్కటే కాదు.. ఉమ్మడి జిల్లాలో తీర ప్రాంత మత్స్యకార గ్రామాలకు... గోదావరి మధ్య ఉండే లంక గ్రామాలకు... మెట్టలోని ఏజెన్సీ ప్రాంతాలను అనుకుని ఉన్న మారుమూల గ్రామాలకు సైతం టెలి మెడిసిన్ ద్వారా మెరుగైన వైద్యం అందుతోంది. వ్యయ ప్రయాసలకు లోనుకాకుండా ఇంటి వద్ద నుంచే వైద్య సేవలు పొందుతున్నారు. దేశవ్యాప్తంగా అమలులో ఉన్న ఈ తరహా వైద్యసేవలు అందించడంలో రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సైతం ఇది విజయవంతంగా నడుస్తోంది. రోగులకు మెరుగైన వైద్యం అందుతోందనే భరోసా కల్పిస్తోంది. ఈ కారణంగానే టెలి మెడిసన్ ద్వారా లబ్ధి పొందేవారి సంఖ్య పెరుగుతోంది. టెలి మెడిసన్ ప్రారంభించిన తరువాత నుంచి ఇప్పటి వరకు తూర్పు గోదావరి జిల్లా 10,13,130 మందికి, కాకినాడ జిల్లాలో 11,42,478 మందికి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 8,61,955 మందికి చొప్పున మొత్తం ఉమ్మడి జిల్లా పరిధిలో 30,17,563 మందికి టెలి మెడిసన్ ద్వారా మెరుగైన వైద్యసేవలు, మందులు అందాయి. కరోనా తరువాత టెలి మెడిసన్ నిలిచిపోయినా ప్రభుత్వం దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో తిరిగి ఆరంభమైంది.

రీజనల్ హబ్‌లో 21 మంది నిపుణులు

ఉమ్మడి జిల్లాలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల వద్ద నియమించిన మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు (ఎంఎల్‌హెచ్‌పీ)ల ద్వారా ప్రాథమిక వైద్య సేవలందుతున్నాయి. ఇవి కాకుండా కాస్త సమస్యగా అనిపించిన రోగులకు, వ్యాధులకు టెలి మెడిసన్ ద్వారా స్థానిక పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రి వైద్యుల నుంచి సేవలందుతున్నాయి. మరింత మెరుగైన సూచనలు రోగులకు, స్థానిక వైద్య సిబ్బందికి తెలియచెప్పేందుకు ప్రభుత్వం టెలి మెడిసన్ వైద్యం కోసం రీజనల్ మెడికల్ హబ్‌లను ఏర్పాటు చేసింది. ఉమ్మడి జిల్లా విశాఖ రీజన్ హబ్ పరిధిలోకి వస్తోంది. దీని పరిధిలో జనరల్ మెడిసన్, గైనకాలజీ, పీడియాట్రిషియన్‌లతోపాటు 21 మంది వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు అందుబాటులో ఉంటున్నారు. వీరి ద్వారా అవసరమైన వైద్యసేవలు మారుమూల ప్రాంతాల్లోని రోగులకు అందుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని ఒక్కొక్క వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ద్వారా రోజుకు 15 నుంచి 20 మంది వరకు టెలి మెడిసిన్ వైద్యం అందుతోందని అంచనా. ఎంఎల్‌హెచ్‌పీల ద్వారానే కాకుండా ఈ – సంజీవని యాప్ డౌన్‌లోడు చేసుకుని నేరుగా వైద్యుల నుంచి సేవలు పొందుతున్నారు.



టెలి మెడిసన్ యాప్



టెలి మెడిసన్ ద్వారా చిన్నారి చికిత్సకు సలహాలు తీసుకుంటున్న వైద్య సిబ్బంది, చిన్నారి తల్లి

దీర్ఘకాలిక రోగులకు మేలు

ఎక్కువగా మధుమేహం, రక్త పోటు, గర్భిణులు, చిన్నపిల్లలు, మంచాల మీద ఉంటున్న రోగులకు టెలి మెడిసన్ ద్వారా నాణ్యమైన వైద్య సేవలందుతున్నాయి. కొన్ని రోగాలకు సంబంధించి వైద్య నిపుణులు నేరుగా రోగులతో మాట్లాడడం, వారి ఆరోగ్యం గురించి అడగడం, వైద్య సూచనలు చేయడం వంటివి రోగులలకు మానసిక స్థైర్యాన్ని ఇస్తున్నాయి. చికిత్సతోపాటు మందులను సైతం వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వీటిలో చాలావరకు విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా అందుతున్నాయి. ఇప్పటికే 67 రకాల మందులను అందజేస్తుండగా, తాజాగా వీటిని 105 రకాలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయించింది. థైరాయిడ్, లెప్రసీ వంటి వాటి దీర్ఘకాలిక రోగులకు సైతం మందులు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇంటి వద్ద నుంచే వైద్య సేవలు



ఈ– సంజీవని ద్వారా ఇంటి వద్ద నుంచే వైద్య సేవలు పొందే అవకాశముంది. నిపుణులైన వైద్యులు కూడా టెలి మెడిసిన్ ద్వారా సలహాలు, సూచనలు అందజేస్తారు. మందులు కూడా సిఫారసు చేస్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు దూరంగా ఉండేవారికి దీనివల్ల మేలు ఎక్కువగా జరుగుతోంది.

– బి.మంగాదేవి, వైద్యాధికారి, అయినవిల్లి

మెగా సర్వే చంద్రబాబుకు

చెంపపెట్టు

- కోటి కుటుంబాల్లో 80 శాతం నినాదం ‘జగనన్నే మా భవిష్యత్తు’
- మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



ప్రజా మద్దతు సర్వే కోటి కుటుంబాలను చేరుకుందని ఫ్లకార్డు చూపిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగేళ్ల పాలన పూర్తవుతున్న వేళ చేపట్టిన ప్రజామద్దతు సర్వేలో కోటి కుటుంబాలను పార్టీ శ్రేణులు కలిస్తే అందులో 80 శాతం కుటుంబాలు మిస్డ్ కాల్ చేయడం ద్వారా ‘జగనన్నే మా భవిష్యత్తు’ అంటూ సంపూర్ణ మద్దతు ప్రకటించాయని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి వేణు మాట్లాడుతూ మాధ్యమాల ద్వారా చంద్రబాబునాయుడు కుట్రపూరితంగా చేస్తున్న దుష్ప్రచారానికి ఈ ప్రత్యక్ష మెగా సర్వే చెంపపెట్టు అని అన్నారు. రాజకీయాల్లో అబద్ధానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచే చంద్రబాబునాయుడు ఎన్నికల మేనిఫెస్టోలో 600 హామీలు ఇచ్చి, కనీసం ఆరు హామీలు కూడా నెరవేర్చలేకపోయారన్నారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు పేజీల మేనిఫెస్టోలో 98.9 శాతం హామీలను నెరవేర్చారన్నారు. రాజకీయ నాయకులు ఇచ్చిన మాటకు కట్టుబడరన్న అపవాదు నుంచి మాటిస్తే నెరవేర్చి తీరుతారని నిరూపించి ముఖ్యమంత్రి ప్రజల్లో రాజకీయాలపై విశ్వాసం పెంచారన్నారు. చంద్రబాబు పాలనలో రైతులు, మహిళలు, యువకులు అన్ని వర్గాలు, అన్ని కులాలు మోసానికి గురైతే, వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో కులాలు, మతాలు, పార్టీలు చూడకుండా అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పాలన అందిస్తూ గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని నెరవేర్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. అందుకే రాష్ట్ర ప్రజలు ముక్తకంఠంతో జగనన్నే మా నమ్మకం, జగనన్నే మా భవిష్యత్తు అని మెగా సర్వే ద్వారా నిరూపించారని మంత్రి వేణు అన్నారు.

మూడురోజులు వరి కోతలు వద్దు

‘స్పందన’ కార్యక్రమంలో రైతులతో కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రాబోయే మూడు రోజులు వర్షాలు పడే అవకాశం ఉన్నందున వరి కోతలు చేపట్టవద్దని కలెక్టర్ హిమాన్షు శుక్లా కోనసీమ జిల్లా రైతులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ స్పందన హాల్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో అర్జీదారుల నుంచి సుమారు 180 అర్జీలను కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర. జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు స్వీకరించారు. కొంత మంది రైతు నాయకులు రబీలో ధాన్యం సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పండించిన ధాన్యం కొంత మేర కళ్లాల్లో తడిసాయని, అంతమాత్రాన ఆందోళన చెందాల్సిన పనిలేదని అన్నారు. తడిసిన ధాన్యాన్ని అరబెట్టుకునేందుకు జిల్లా యంత్రాంగాం రైతులకు తోడ్పాటును అందిస్తుందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని విక్రయించుకొని కనీస మద్దతు ధరలు పొందాలని సూచించారు. ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామానికి చెందిన సీహెచ్ సూర్యచంద్రరావు, సోయాసిస్ వ్యాధితో బాధపడుతున్న తమ కుమారుడి పేరు రేషన్‌కార్డులో చేర్చాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ స్పందించి రేషన్ కార్డులో పేరు చేర్చడంతో పాటు ఆరోగ్యశ్రీ ద్వారా సోయాసిస్ నిర్మూలనకు చికిత్స అందిస్తామని స్పష్టం చేశారు. రామచంద్రపురం పట్టణానికి చెందిన మందపల్లి వెంకటరమణ అనే దివ్యాంగునికి వికలాంగులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ద్వారా ట్రై సైకిల్ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ నెల 25వ తేదీ ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవం, కీటక జనత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఆయా కార్యక్రమాల నిర్మూలన నియంత్రణ అంశాలపై ముద్రించిన వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. డీసీహెచ్ఎస్.పద్మశ్రీ రాణి, సీపీవో వెంకటేశ్వర్లు, డీఎస్ఓపీ పాపారావు డీఆర్డీఏ పీడీ వి.శివశంకర్ ప్రసాద్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.నాగేశ్వరరావు, డీఎంహెచ్ ఓ దుర్గారావు దొర, మత్స్యశాఖ జేడీ షేక్ లాల్ మహమ్మద్, డ్వామా పీడీ మధుసూదన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

పోలీసు స్పందనకు 34 అర్జీలు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక – స్పందన కార్యక్రమానికి 34 అర్జీలు వచ్చాయి. ఎస్పీ సుసారపు శ్రీధర్ నిర్వహించిన ఈ స్పందన కార్యక్రమంలో కొందరు కుటుంబ తగదాలు, ఆస్తి వివాదాల సమస్యలను చెప్పుకుంటే...మరి కొందరు ప్రజా సమస్యలపై ఫిర్యాదులు చేశారు. విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ప్రతినిధులు అమలాపురంలో గో వధ చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అల్లవరం మండలం దేవగుప్తం నుంచి వచ్చిన కొంతమంది మండలంలో ఫ్లెక్సీలు, డీజేలు, ర్యాలీలకు అనుమతులు ఇవ్వవద్దని ఫిర్యాదు చేశారు. ఎస్పీ కార్యాలయ స్పందన కార్యక్రమ పర్యవేక్షణ ఎస్సై సీహెచ్ వెంకటరమణ పాల్గొన్నారు.

అమలాపురానికి ఎల్‌ఈడీ కాంతులు

రెండు సెంటర్లలో ప్రారంభించిన మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: జిల్లా కేంద్రం అమలాపురానికి అన్ని వసతుల కల్పనకు దశల వారీగా చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. అమలాపురంలోని అన్ని సెంటర్లను హైమాస్ట్ పోల్స్, ఎల్ఈడీ కాంతులతో నింపుతామని వెల్లడించారు. స్థానిక గడియారం స్తంభం సెంటరు సమీపంలోని బస్ షెల్టర్ కూడలి, శ్రీరామపురం సెంటరులో రూ.10 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ పోల్స్, ఎల్ఈడీ లైట్లను మంత్రి విశ్వరూప్ సోమవారం రాత్రి ప్రారంభించారు. ఈ రెండు సెంటర్ల తరహాలోనే పట్టణంలోని మరో పది సెంటర్లలో ఈ స్థాయి లైటింగ్ ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే మున్సిపాలిటీ రూ.45 లక్షలతో బ్యూటిఫికేషన్ కోసం టెండర్ల ప్రక్రియ పూర్తి చేసిందని, ప్రతీ సెంటర్‌లో ఎల్ఈడీ కాంతులు తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతోందన్నారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, రాష్ట్ర దృశ్య కళల అకాడమి చైర్‌పర్సన్ కుడుపూడి సత్య శైలజ, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాన్ ప్రసంగించి జిల్లా కేంద్రమైన అమలాపురాన్ని ప్రణాళిక అభివృద్ధి చేస్తున్న మంత్రి విశ్వరూప్ కృషిని అభినందించారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజు, కౌన్సిలర్లు చిట్టూరి పెదబాబు, బండారు గోవిందు, నాగారపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



హైమాస్ట్ పోల్స్, ఎల్ఈడీ లైట్లను ప్రారంభిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

కౌలు రైతుకు పరపతి

- వ్యవసాయ ప్రోత్సాహానికి కొత్త పథకం
- గరిష్టంగా రూ.లక్ష రుణం మంజూరు
- పైలట్ ప్రాజెక్టుగా 10 గ్రామాల ఎంపిక

కొత్తపేట: కొన్నేళ్లుగా భూ యజమానుల వ్యవసాయం చేయడం తగ్గిపోయి కౌలుదారుల సాగు పెరిగింది. కౌలురైతులకు ఆస్తులు లేకపోవడంతో ఆర్థిక సంస్థల నుంచి రుణసౌకర్యం కష్టతరమవుతోంది. నిరక్షరాస్యులైన రైతులు ఆర్థిక సంస్థలు విధించే రుణ నియమ నిబంధనలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందువల్ల కౌలు రైతులు గ్రామంలోని వడ్డీ వ్యాపారులు లేదా ఇతరుల వద్ద లేదా ధాన్యం కమీషన్ వ్యాపారుల వద్ద స్థలం, ఇల్లు, పండించే పంటను తాకట్టు పెట్టి అధిక వడ్డీలకు రుణాలు చేయవలసివస్తోంది. దాంతో వారి కష్టానికి ఫలితం దక్కడం లేదు. ఎన్ని ఎకరాలు సాగు చేసినా గొర్రె తోక బెత్తెడే అన్నట్టు వచ్చిన లాభం వడ్డీలకే సరిపోతోంది. ఇటువంటి పరిస్థితుల్లో కౌలు రైతులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దానిలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా కౌలురైతులకు సహకార వ్యవస్థ ద్వారా పరపతి కల్పించి వారి ఆర్థిక, జీవన స్థితిగతులు మార్చాలని యోచించారు. పథకాన్ని రూపొందించారు. ఆ మేరకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) కాకినాడ పరిధిలోని 10 డీసీసీబీ బ్రాంచ్‌ల ద్వారా పైలట్ ప్రాజెక్టుగా 10 మండలాల నుంచి 10 గ్రామాలను ఎంపిక చేశారు. వ్యవసాయ శాఖ ద్వారా ఆయా మండల అధికారులు కౌలు రైతులకు అవగాహన కార్యక్రమాలు, అర్హులైన కౌలు రైతుల ఎంపిక ప్రక్రియ చేపట్టారు.

ప్రాజెక్టు విధి విధానాలు

- నిపుణులైన కౌలు రైతులను గుర్తించాలి
- ఇంజినీర్లు, డాక్టర్లు తదితర నిపుణులకు ఇచ్చే ప్రాముఖ్యత వ్యవసాయ నిపుణులకు ఇవ్వాలి.
- కౌలురైతులు సీసీఆర్‌సీ కార్డు పొందడానికి భూమి యజమాని నుంచి ‘నో అబ్జెక్షన్ సర్టిఫికెట్’ పొందవలసిన అవసరాన్ని నిరోధించి, రుణం మంజూరు చేయడానికి పంటను ఆస్తిగా పరిగణించాలి.
- ఈ పైలట్ ప్రాజెక్ట్ అమలు చేయడానికి ఒక గ్రామాన్ని (ఆర్బీకే)ను యూనిట్‌గా నిర్ణయించారు.
- విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్ (వీఏఏ) కౌలు రైతులు (అగ్రికల్చరల్ ప్రొఫెషనల్స్)ను గుర్తించాలి.

అర్హతలు

- గ్రామంలో కనీసం ఐదేళ్లు నిరంతరంగా నివాసం ఉండాలి. ఆ గ్రామంలో భూమినే సాగు చేస్తుండాలి.
- రుణం పొందడానికి గరిష్ట వయసు 65 సంవత్సరాలు
- కుటుంబంలో ఒక సభ్యుడు మాత్రమే రుణం పొందడానికి అర్హులు
- బ్యాంకులు / సహకార సంఘాల్లో రుణ చరిత్ర బాగుండాలి.
- తెలుపు రేషన్ కార్డు కలిగి ఉండాలి
- సాగు చేసిన పంట పొలాన్ని వీఏఏ గుర్తించాలి.



కొత్తపేట మండలం అవిడిలో కౌలు రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ పి.పద్మలత

- రుణ మంజూరుకు ఎంపికైన కౌలు రైతుల జాబితాను మండల వ్యవసాయ అధికారి, తహసీల్దార్ ఆమోదించాలి.
- వ్యవసాయ కార్యకలాపాలు ప్రారంభించడానికి నెలరోజుల ముందు పైన తెలియచేసిన డేటాబేస్‌ను ఆన్‌లైన్‌లో బ్యాంకుకు తెలియచేయాలి.
- రుణాన్ని రెండు విడతలుగా అంటే 25 శాతం పంటను విత్తే సమయంలో, మిగిలిన 75 శాతం నాట్లు వేసిన 50 రోజుల అనంతరం (వరి పంటకు అయితే) వీఏఏ, వీఆర్ఓ నివేదిక ఆధారంగా చెల్లిస్తారు.



కొత్తపేటలో వరి చేనుకు మందు పిచికారీ చేస్తున్న కౌలురైతు (ఫైల్)

జిల్లాలో రుణ వితరణకు ఎంపికైనవి ఇవీ..

మండలం	–	గ్రామం
కొత్తపేట	–	అవిడి
రావులపాలెం	–	రావులపాడు
పి.గన్నవరం	–	ఊడిమూడి
అయినవిల్లి	–	పోతుకుర్రు
అంబాజీపేట	–	మాచవరం
మామిడికుదురు	–	గెద్దాడ
రాజోలు	–	చింతలపల్లి
మల్కిపురం	–	లక్కవరం
అల్లవరం	–	కోడూరుపాడు
ముమ్మిడివరం	–	చినకొత్తలంక

- రుణ రికవరీ పంట ద్వారా వచ్చే ఆదాయంతో ముడిపడి ఉంటుంది.

నియమ నిబంధనలు

- బ్యాంకు రుణంపై 10 శాతం షేరు ధనం చెల్లించాలి.
- కౌలు రైతుకు ఇన్సూరెన్స్ తప్పక ఉండాలి.
- రుణం పొందే కౌలురైతు బ్యాంకులో బీ – క్లాస్ మెంబర్‌షిప్ పొందాలి
- సాగు చేస్తున్న పంటను ఇ– క్రాప్‌లో నమోదు చేయించాలి.
- గరిష్టంగా రూ.లక్ష రుణం మంజూరు చేస్తారు. కాలపరిమితి 11 నెలలు. కాలపరిమితి లోపు పంటను విక్రయిస్తే వెంటనే రుణం చెల్లించాలి.
- రుణంపై వడ్డీ 12 శాతం. సకాలంలో రుణం చెల్లించకపోతే 2 శాతం అపరాధ వడ్డీతో చెల్లించాలి.
- ప్రస్తుత పంటకు తీసుకున్న రుణం మొత్తం (అసలు, వడ్డీ) తిరిగి చెల్లించిన వెంటనే తదుపరి పంటకు రుణం ఇదే పద్ధతిలో ఎటువంటి ఆలస్యం లేకుండా మంజూరు చేస్తారు.

ఎంతో ప్రయోజనం



కౌలు రైతులకు ప్రభుత్వం సహకార వ్యవస్థ ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తుంది. ఈ పథకంతో వారికి ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

– ఎస్‌జేవీ రామమోహనరావు, ఏడీఏ, పి.గన్నవరం

రుణ సౌకర్యంతో మేలు



నేను ఐదు ఎకరాల పొలం కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నాను. ప్రభుత్వం రూపాయి వడ్డీకే బ్యాంకు రుణ సౌకర్యం కల్పించడం మాకెంతో మేలు చేస్తుంది.

– కొండేటి శ్రీను, కౌలు రైతు, అవిడి, కొత్తపేట మండలం

క్లుప్తంగా

శ్రీ ప్రకాష్ స్కూల్ స్నాతకోత్సవం



స్నాతకోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): శ్రీ ప్రకాష్ సురేష్‌నగర్ పాఠశాల 3, 5 తరగతుల విద్యార్థుల స్నాతకోత్సవం సోమవారం సాయంత్రం నిర్వహించారు. వాయిస్ ఆఫ్ స్పీడ్ ట్రైనర్, డైరెక్టర్ జిల్‌మిల్ హాజరికా ముఖ్యఅతిథిగా హాజరై షేక్ స్పియర్ రచించిన హ్యామ్లెట్, గ్రీకు రచయిత యూరిపిడస్ రచించిన మీడియా రెండింటిని కలిపి స్త్రీ సాధికారత కోసం రచించిన కిల్ నాట్ టు కిల్ అనే నాటకం ప్రదర్శించారు. మరో ముఖ్య అతిథి నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా డైరెక్టర్ అభిలాష్ పిళ్లై (కేరళ) మాట్లాడుతూ చిన్న వయస్సులో ఏవిషయాలపై ఆసక్తి ఉందో గ్రహించి వారిని ఆ విధంగా ప్రోత్సహించాలన్నారు. స్మార్ట్ షేక్‌స్పియర్, రాకింగ్ రామానుజన్, నంబర్ క్రంచర్, పద్య యోధ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. డాక్టర్ శివప్రసాద్, పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయప్రకాష్, ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ఎస్ మూర్తి, ఎం.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రుణగొణ ధ్వనులకు మంగళం

- మహిళా సంఘాల లెక్క..ఇక పక్కా
- పొదుపు..రుణ వివరాల్లో పారదర్శకత
- మే నుంచి అందుబాటులోకి 'లోకోస్' యాప్ సేవలు
- వినియోగంపై వీవోఏ, ఏపీఎం, సీసీలకు శిక్షణ
- కోనసీమ జిల్లాలో 38,450 మహిళా శక్తి సంఘాలు



మహిళా శక్తి సంఘాల సభ్యులు

రాయవరం: పొదుపు సంఘాల లెక్కలు ఇకపై పక్కాగా ఉండనున్నాయి. సంఘంలోని మహిళలు పొందే రుణాలు, వారు చెల్లిస్తున్న వడ్డీ, సంఘాల కార్యకలాపాలు, పొదుపు వివరాల్లో పూర్తి పారదర్శకత చోటు చేసుకోనుంది. ఎక్కడా లోపం లేకుండా పర్యవేక్షణ జరుగనుంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఈ నూతన అప్లికేషన్‌ను రూపొందించింది. డ్వాక్రా సంఘాల్లో జరుగుతున్న ఆర్థికాభివృద్ధి, ప్రభుత్వ పథకాలపై అవగాహన, వారు నిర్వహిస్తున్న వ్యాపారం, పొందుతున్న లాభాలు తదితర సమాచార వివరాల పక్కాగా ఉండే విధంగా కొత్తగా 'లోకోస్' అనే యాప్‌ను మే నెల నుంచి అందుబాటులోకి తీసుకురానున్నారు. దేశవ్యాప్తంగా పొదుపు సంఘాల వివరాలన్నీ ఈ యాప్ ద్వారా ఒకే గొడుగు కిందకు రానున్నాయి. గ్రామీణ జీవనోపాదుల మిషన్ (నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్) ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.

వేర్వేరు యాప్‌లకు స్వస్తి

ఇప్పటి వరకు పొదుపు సంఘాల వివరాలను వేర్వేరు యాప్‌ల్లో నమోదు చేస్తున్నారు. సంఘాల పనితీరు..ఆర్థిక లావాదేవీలు, ఇతర వివరాల నమోదుకు ఒక్కో యాప్‌ను వినియోగించేవారు. మహిళా శక్తి సంఘాల్లోని సభ్యుల వ్యక్తిగత వివరాలు, వారి ఆర్థిక పరిస్థితి, సంఘాల ఆర్థిక లావాదేవీలన్నీ ఇకపై ఒకే యాప్‌లో నమోదు చేయనున్నారు. దీని వలన సమగ్ర సమాచారం ఒకేచోట లభిస్తుంది. డిజిటలైజేషన్‌లో భాగంగా ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు.

ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత

ప్రధానంగా పొదుపు సంఘాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న ఆర్థిక రుణాలపై పారదర్శకత ఉండే విధంగా ఈ యాప్ ఉపయోగపడనుంది. భవిష్యత్తులో ఆధార్ ప్రామాణికంగా రుణాలు మంజూరయ్యే అవకాశముంది. ఎక్కడైనా రెండు, మూడు సంఘాల్లో సభ్యులుగా ఉంటూ, వేర్వేరు చోట్ల రుణాలు పొందడానికి ఇకపై అవకాశముండదు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 38,450 మహిళా శక్తి సంఘాలున్నాయి. ఈ సంఘాల్లో 3,99,333 మంది సభ్యులుగా ఉన్నారు. సంఘాల్లో ఉన్న సభ్యులు తీసుకుంటున్న రుణాలు, చెల్లిస్తున్న రుణ వాయిదాలకు సంబంధించిన వివరాలను యాప్‌లో నమోదు చేస్తారు. దీనివల్ల ఎక్కడా లోపం లేకుండా పర్యవేక్షణ సులువుగా ఉంటుంది. తద్వారా పనిభారం తగ్గి సమయం కలసి వస్తుంది. రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో, వైఎస్సార్ క్రాంతి పథం సంస్థ సారథ్యంలో స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలు పర్యవేక్షిస్తారు. ఇకపై మహిళా శక్తి సంఘాల సమాచారంతో పాటు, గ్రామ సంఘాల సమాచారం కూడా ఈ యాప్ ద్వారానే పర్యవేక్షిస్తుంటారు.

త్వరలోనే శిక్షణ పూర్తి

ప్రస్తుతం లోకోస్ యాప్ వినియోగంపై రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన జిల్లా రిసోర్స్ పర్సన్స్ ఎంవీఎల్ కుమారి, డి.వరాలబాబు, జి.దుర్గాప్రసాద్, టి.జోగారావు, హైమాప్రశాంతి, సాయికుమారి శిక్షణనిస్తున్నారు. గ్రామ సంఘాల అసిస్టెంట్లు (వీవోఏ), అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లు (ఏపీఎం), క్లస్టర్ కోఆర్డినేటర్ల (సీసీ)కు జిల్లా స్థాయిలో శిక్షణనిస్తున్నారు. ప్రతి మండలం నుంచి ముగ్గురు వీవోఏలు, ఒక్కొక్క ఏపీఎం, సీసీలకు శిక్షణ ఇస్తున్నారు. లోకోస్ యాప్ ప్రధాన ఉద్దేశం, యాప్‌ను ఎలా వినియోగించాలి? ఆర్థిక లావాదేవీలు ఎలా నమోదు చేయాలి? నమోదు అనంతరం నివేదికలను ఎలా పరిశీలించాలి? తదితర అంశాలపై మూడు రోజుల వంతున శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని సఖినేటిపల్లి, రాజోలు, మలికిపురం, మామిడికుదురు, పి.గన్నవరం, అల్లవరం, అమలాపురం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, ఐ.పోలవరం మండలాలకు ఐదుగురి వంతున 55 మందికి శిక్షణ పూర్తి చేశారు. ఈ నెల 25 నుంచి 27 వరకు కొత్తపేట, ఆయినవిల్లి, ఆలమూరు, అంబాజీపేట, ఆత్రేయపురం, రావులపాలెం, కె.గంగవరం, కపిలేశ్వరపురం, మండపేట, రామచంద్రపురం, రాయవరం మండలాల పరిధిలోని వారికి శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పొందిన వీవోఏలు, ఏపీఎం, సీసీలు తిరిగి మండల స్థాయిలో గ్రామ సంఘాల సహాయకులకు శిక్షణ ఇస్తారు.

'లోకోస్' యాప్ లోగో

ఒకే యాప్‌లో సమగ్ర సమాచారం



లోకోస్ యాప్ వల్ల పొదుపు సంఘాల సమగ్ర సమాచారం ఒకచోటే లభిస్తుంది. యాప్‌ను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకుని రాగానే పొదుపు సంఘాల సమాచారాన్ని అందులో నమోదు చేస్తాం. దీనివల్ల సంఘాలు, సభ్యులకు సంబంధించిన పూర్తి సమాచారం అందుబాటులో ఉంటుంది. ఇది వరకు వేర్వేరు యాప్‌ల్లో నమోదు చేయడం ద్వారా వాటిని సేకరించేందుకు సమయం పట్టేది. ప్రస్తుతం ఈ యాప్‌తో అటువంటి సమస్య ఉండదు.

– డాక్టర్ డి.శివశంకరప్రసాద్, పీడీ, డీఆర్‌డీఏ, అమలాపురం

వీరేశ్వరుని బ్రహ్మోత్సవాలు ఆరంభం



పసుపును దంచుతున్న ముత్తయిదువలు



భద్రపీఠంపై కొలువుదీరిన స్వామి, అమ్మవారు

ఐదు రోజులు అలరించనున్న ఆధ్యాత్మిక సంబరాలు

ఐ.పోలవరం: నిత్యకళ్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందుకు నాందిగా గ్రామంలోని మహిళలు ఆలయ ఆవరణలో పసుపు కొమ్ములను రోకట్లో దంచారు. శైవాగమ పద్ధతిలో స్వర్ణ రుద్రాక్ష కంకణ, స్వర్ణ సింహతలాట సన్మాన గ్రహీత, రాష్ట్ర ఆదిశైవ అర్చక సంఘ అధ్యక్షుడు యనమండ్ర సత్యసీతారామ శర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకస్వాముల, అధికారుల పర్యవేక్షణలో ఈ అయిదు రోజుల క్రతువుకు శ్రీకారం చుట్టారు. ఆలయంలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను నూతన వధూవరులను చేశారు. అనంతరం పండితులు పంచామృతాలతో స్వామి వారికి, అమ్మవారికి స్నానాలు చేయించారు. బ్రహ్మోత్సవ కల్యాణ మూర్తులకు జంపన రామకృష్ణ దంపతులు పట్టు వస్త్రాలు అందజేశారు.

సాయంత్రం ఆలయ ఆవరణలో అంకురారోపణ, అగ్ని ప్రతిష్ఠాపన నిర్వహించారు. స్వామి అమ్మవార్లను భద్రపీఠంపై ఉంచి ప్రత్యేక అలంకరణలో గ్రామోత్సవాన్ని కన్నుల వైకుంఠంగా నిర్వహించారు. అనంతరం ఎదురు సన్నాహం, స్వామి వారి ఆలయ ప్రదక్షిణ సాగింది. నిత్యం జరిగే స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కల్యాణ మహోత్సవానికి వందలాది మంది భక్తులు హాజరయ్యారు. ఆలయ ఆవరణ చలువ పందిళ్లు, యాగశాల, విద్యుత్ దీపాలంకరణ తదితరాలతో ఆలయం కల్యాణ శోభతో మెరిసిపోయింది. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లను ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు.

ఘనంగా వైదిక కార్యక్రమాలు



వైదిక కమిటీ సభ్యులకు సూచనలిస్తున్న ఈఓ చంద్రశేఖర్ అజాద్

అన్నవరం: ఈ నెల 30వ తేదీ నుంచి జరగనున్న సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలలో స్వామి, అమ్మవార్లకు నిర్వహించే వైదిక పరమైన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ ఆదేశించారు. సోమవారం ఆయన దేవస్థానం వేద పండితులు, అర్చకులతో సమావేశమయ్యారు. 30వ తేదీన స్వామి, అమ్మవార్లను వధూవరులను చేసే కార్యక్రమం మొదలుకుని మే ఒకటో తేదీన సత్యదేవుని దివ్యకల్యాణం, రెండో తేదీ అరుంధతి దర్శనం, మూడో తేదీన వేదపండిత సదస్యం, నాలుగో తేదీన వనవిహారం, ఐదో తేదీన చక్రస్నానం, ఆరో తేదీన శ్రీపుష్పయాగం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాలకు అవసరమైన పూజా సామగ్రిని ముందుగానే సమకూర్చుకోవాలని ఆదేశించారు. సమావేశంలో వైదిక కమిటీ సభ్యులు వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, చిట్టి శివ, ప్రధానార్చకుడు కోట శ్రీనివాస్, స్పెషల్ గ్రేడ్ వ్రత పురోహితుడు ముత్య సత్యనారాయణ, కల్యాణబ్రహ్మ ఛామర్తి కన్నబాబు పాల్గొన్నారు.

చంద్రబాబు అన్యాయాన్ని బీసీలు ఎప్పటికీ క్షమించరు..

మంత్రి వేణు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణు

రామచంద్రపురం: రాష్ట్రంలో బీసీలకు చంద్రబాబునాయుడు చేసిన అన్యాయాన్ని బీసీలు ఎప్పటికీ క్షమించరని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తనకు అన్నీ తెలుసు అని భ్రమింపజేయడానికి లోకేష్ మాట్లాడుతున్నారన్నారు. ఈనాడు పత్రికలో 'బీసీ సంక్షేమానికి ఎంత ఖర్చు చేశారు' అంటూ లోకేష్ వ్యాఖ్యలపై మంత్రి వేణు స్పందించారు. లోకేష్‌కు రాసిచ్చింది చదవడం మాత్రమే తెలుసు అని ఎద్దేవా చేశారు. చంద్రబాబు వద్దకు మత్స్యకారులు వెళ్లి తమ సమస్య చెప్పుకుంటే తోలు తీస్తానన్నాడన్నారు. నాయీ బ్రాహ్మణులు వెళితే తోకలు కత్తిరిస్తానన్నారు. కానీ జగనన్న పాలనలో ఏ గుడి మెట్ల మీద సేవలు అందించాడో ఆ గుడికి నాయీబ్రాహ్మణుడు పాలకుడు కాబోతున్నాడన్నారు. దివిటీలు పట్టిన రజకులు చైర్మన్లు అవుతున్నారన్నారు. ఐటీ బూమ్ తెచ్చింది నేనే అని గొప్పలు చెప్పుకునే నీ తండ్రి, నువ్వు మహానేత రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్సుమెంటు ద్వారా బీసీలు ఇంజినీర్లుగా, డాక్టర్లుగా ఎదిగారని గుర్తుంచుకోవాలన్నారు. మీ పాలనలో చేతివృత్తి పనిముట్లు అరకొరగా అందించి వాటి కోసం కూడా జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లు అరిగేలా తిప్పుకునేవారని, కానీ జగనన్న పాలనలో అవినీతికి తావులేకుండా, ఎవరినీ ఆశ్రయించాల్సిన పనిలేకుండా నవరత్నాల పథకాల ద్వారా ప్రతీ బీసీ కులానికి చెందిన వారికీ నేరుగా వారి ఖాతాలోనే ఆర్థిక సాయం జమ చేస్తూ వారి ఎదుగుదలకు బాటలు వేస్తున్నామన్నారు. బీసీలు జడ్జీలుగా పనికిరారన్న బీసీ ద్రోహి నీ తండ్రి అయితే బీసీలను ఉప ముఖ్యమంత్రులుగా, రాజ్యసభ సభ్యులుగా, కార్పొరేషన్ల చైర్మన్లుగా రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అన్ని విధాలుగా ఎదిగేలా చేస్తున్న బీసీ పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని గుర్తుంచుకోవాలన్నారు.

ఆత్మహత్యకు పాల్పడ్డ యానిమేటర్?

రాయవరం: మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన వివాహిత ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్యకు పాల్పడ్డ వివాహిత ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం. అయితే వివాహిత మృతి చెందగా, ఇద్దరు చిన్నారులు కోలుకుంటున్నట్లు తెలిసింది. వివాహిత ఆత్మహత్యకు ఎందుకు పాల్పడిందన్న విషయం తెలియరాలేదు. ఆత్మహత్యకు పాల్పడ్డ మహిళ డ్వాక్రా యానిమేటర్‌గా పనిచేస్తున్నట్లు తెలియవచ్చింది.

జూదరుల అరెస్ట్

కరప: మండలం జి.భావారంలో పేకాట శిబిరంపై కరప పోలీసులు దాడి చేసి, ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. కరప ఎస్‌ఐ నౌడు రామకృష్ణ కథనం మేరకు జి.భావారం గ్రామ పొలిమేరలో పేకాటాడుతున్నట్టు సోమవారం కరప పోలీసులకు సమాచారం అందింది. ఎస్‌ఐ రామకృష్ణ సిబ్బందితో వెళ్లి పేకాట శిబిరంపై దాడి చేశారు. ముగ్గురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.4,910 నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, నిందితులను కాకినాడ కోర్టులో హాజరుపరచినట్టు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.